# కోర్టు మార్షల్

శృంగార వీధి

కల్నల్ ఎన్.కె.నరసింహం

**సెకండ్ లెఫ్టినెంట్ ప్రసాద్ డెహరాడూన్ మిలిటరీ అకాడెమీనుంచి కొత్తగా ఆర్మీఆఫీసరుగా ఉదంపూర్ యూనిట్‌కు పోస్టింగయి వచ్చాడు.**

**యుద్ధకాలం.**

**ఆర్మీ అంతా అప్రమత్తంగా వుంది. మామూలు సైనికుని దగ్గర్నుంచీ, ప్రభుత్వంవరకూ అందరూ పరిస్థితుల్నిబట్టి కళ్లమీద కునుకు లేకుండా వున్నారు. అంచనాలమేరకు సైనికబలగాల్ని హుటాహుటిగా ఒకచోటి నుంచి మరోచోటికి, ఒక ప్రాంతంనుంచి మరో ప్రాంతానికి తరలిస్తున్నారు.**

కొత్తగా పోస్టింగయిన ఆఫీసర్లకు వారి నైపుణ్యాన్ని ప్రదర్శించే అవకాశాల్ని కల్పించి వాళ్లలో శక్తిసామర్ధ్యాలను, ధైర్యసాహసాల్ని మెరుగుపరిచేందుకూ, ఆయాబలగాలకు కేటాయించిన బాధ్యతలను పరిపూర్ణంగా నిర్వర్తించడానికీ, అర్హుల్ని చేయడానికీ కమాండింగ్ ర్యాంక్‌కు తప్పని కర్తవ్యం.

తగినంత కండపుష్టి, కాంతివంతమైన కనులు, పొడుగూ పొట్టీకాక మధ్యతరహా ఎత్తు, సన్నటినడుము, విశాలమైన ఛాతీతో, నడకలో, నడవడిలో చురుకుదనంతో యూనిఫాంలో హుందాగావుంటాడు ప్రసాద్. అతన్ని చూసిన అందరికీ మంచి గురి కుదిరింది.

వచ్చి చేరినరోజే శత్రువుల్ని ఢీకొనడానికి ప్రసాద్ యూనిట్‌ను మరోప్రాంతానికి తరలించాలని హెడ్ క్వార్టర్స్‌నుంచి ఆదేశాలు వచ్చాయి.

ఆదేశాల ప్రకారం కమాండింగ్ ఆఫీసర్ ప్రసాద్‌ను పిలిపించారు.

రాత్రి రెండవుతోంది.

ప్రసాద్ కమాండింగ్ ఆఫీసర్ గుడారంలోకి వెళ్లేటప్పటికే అక్కడ మరో ఇద్దరు ఆఫీసర్లు వున్నారు. గుడారం మధ్యలో టేబిల్ మీద ఓ మ్యాప్ పరిచివుంది.

ప్రసాద్ రాగానే-"వెల్ డియర్ ప్రసాద్, ఇది నువు రేపు వెళుతున్న ప్రాంతపు మ్యాప్. మాకందిన సమాచారాన్నిబట్టి బహుశా శత్రువులు అక్కణ్ణుంచే మనదేశపు సరిహద్దులు దాటే ప్రయత్నం చేయబోతున్నారు. నిన్నక్కడికి వెంటనే పంపిస్తున్నాం. సో-నువు మ్యాప్‌ను బాగాస్టడీచెయ్" అని కమాండింగ్ ఆఫీసర్ అన్నాడు.

ప్రసాద్ మాట్లాడకుండా టేబిల్ దగ్గరికి వెళ్లి మ్యాప్‌ను క్షుణ్ణంగా పరిశీలించాడు.

ఒక నిమిషం గడిచాక ప్రసాద్ ఆఫీసర్‌కేసి చూసి, అటెన్షన్‌లో నిలబడి-"ఫర్ ఎనీ మినిట్ అయాం రెడీసర్!" అన్నాడు.

"గుడ్-నువ్వు బయల్దేరటం నువే నిర్ణయించుకో. బట్ కాంటాక్ట్ మీ ఇన్ ద మార్నింగ్ ఎట్ షార్ప్ ఎయిటోక్లాక్!"

"ఎస్సర్-ఇప్పుడే బయల్దేరితే బహుశా ఉదయానిగ్గానీ అక్కడికి చేరుకోలేను. ఐ విల్ స్టార్ట్ నౌ ఇట్ సెల్ఫ్" అన్నాడు ప్రసాద్.

"అక్కడి వాతావరణం, స్థితిగతులు, కొండలూ, వాగులూ... ఈ వివరాలన్నీ నువు మాకు సాధ్యమైనంత త్వరగా తెలియపరిస్తేగానీ మనం సైనికుల్ని అక్కడికి తరలించలేం. సో-ఆక్ట్ ఇమీడియేట్లీ అండ్ బెస్టాఫ్ లక్!" అన్నాడు ఆఫీసర్.

"ఎస్సర్!" అని ప్రసాద్ మరోసారి అటెన్షన్‌లో సెల్యూట్‌చేసి ఆఫీసర్ గుడారంలోంచి బయటికి నడిచాడు.

* * *

ఇంకా సూర్యోదయం అవలేదుకానీ-తూరుపువేపు అంతా వెలుగ్గా వుంది. ప్రసాద్ తను రావలసిన ప్రాంతాన్ని చేరుకున్నాడు. చుట్టూ కొండలు. కొండలమధ్యలో విశాలంగా నిర్మలంగా ఓ తటాకం. దాన్ని చేరగానే ప్రసాద్‌కు తను రాత్రంతా చేసిన ప్రయాణం బడలిక గుర్తొచ్చింది. కాస్సే పు స్నానం చేస్తేగానీ అలసట తగ్గదనిపించింది. వెంటనే తను మోస్తూన్న వైర్లెస్ కిట్‌ను కిందపెట్టి, యూనిఫాం విప్పి స్వేచ్ఛగా నీళ్లలోకి దిగాడు. ప్రాణానికి హాయనిపించింది. అటూయిటూ ఈదాడు. ఒడ్డుకు వచ్చి కొండ రాయిపైనుంచి నీళ్లఅడుక్కి డైవ్ చేశాడు. హుషారుగావుంది ప్రసాద్‌కు. అలా ఎంతసేపు ఆ నీళ్లలో వున్నాడో తెలీదు-పైకి తేలి ఓసారి అటూయిటూ పరికించేసరికి మరోవేపు తుంగలకావల ఓ స్త్రీ నగ్నంగా నీళ్లలోకి దిగుతూ కనిపించింది.

పోతపోసిన కంచువిగ్రహంలా బలిష్ఠంగా, పొందిగ్గా వుందామె. నిండుయవ్వనాలతో కళ్లకింపుగావుంది.

ఏళ్లనాటినుంచీ రాతివిగ్రహంగా వుండిపోయి హఠాత్తుగా ప్రాణం పోసుకుని కదిలిన ఆ ఖజురాహో అందాల్ని మైమరచి చూశాడు ప్రసాద్.

మెదడుకు ఏ ఆలోచనా కలగలేదు, కానీ అప్రయత్నంగా ఆమెవైపు ఈదుతూవెళ్లాడు. ఆమెను చేరేటప్పటికి అప్పుడే ఆమె ప్రసాద్‌ను చూసింది. హఠాత్తుగా ఎదురైన ఆగంతకుణ్ని చూసి క్షణం తత్తరపడి ఆమె నిశ్చేష్ట అయింది. గబుక్కున నీళ్లలోకి మునగబోయింది. అంత అందం కంటికి దూరమవడం భరించలేకపోయాడు ప్రసాద్. వెంటనే ఆమె భుజాన్ని పట్టుకున్నాడు.

"ప్లీజ్! ఇలాగే వుండిపో! ఇంత అందాన్ని శిల్పాల్లోతప్ప మరెక్కడా చూళ్లేదు. నిన్నిలాగే జీవితాంతం చూడాలనివుంది" అన్నాడు ప్రసాద్.

ఆమె కళ్లలో యిప్పుడు భయంలేదు- తెలీని దగ్గరితనంతప్ప!

తనను ఓ మగాడు జంతువు చూపుల్తో కాకుండా ఆరాధననే నిండా నింపుకున్న చూపుల్తో చూడడం ఆమెకు తన్మయత్వాన్నిచ్చింది. తనలో, తన శరీరంలో కేవలం స్త్రీనికాకుండా ప్రకృతినిచూసి ముగ్ధుడైన ఒక సౌందర్యోపాసకుడుగా కనిపిస్తున్నాడు. ఆమెలో యిప్పుడు సిగ్గు మాయమయ్యింది. నిస్సంకోచంగా నిండుగా నీళ్లపైకి తేలిన విప్పారిన పద్మంలా ప్రసాద్ ముందు నిలబడింది.

మొలవరకూ నీళ్లలో ఆ పైన దేవతాస్త్రీలా కనిపించింది ఆమె.

ప్రసాద్ ఆమె భుజాల్ని వొదిలి ఆకాశంకేసి చేతులెత్తి -"దేవుడా! నాకీ అదృష్టాన్ని ప్రసాదించు స్వామీ!" అన్నాడు కళ్లు మూసుకుని భక్తితో.

ఆమెకూడా ఆశ్చర్యంగా ఆకాశంకేసి చూసింది.

ఆ తర్వాత వాళ్లిద్దరూ అంతనగ్నంగానే చాలాసేపు గడిపారు. సూర్యోదయమైంది. అంతటి వెలుగులోనూ వాళ్లిద్దరూ స్వేచ్ఛగా నిర్లజ్జగా ఏ

బెరుకూ లేకుండా కేవలం ఒకరికొకరి దగ్గరితనాన్నే కోరి ప్రవర్తించారు తప్ప వాళ్లలో మరో అలజడే కలగలేదు.

* * *

యుద్ధం ముగిసింది.

యుద్ధంలో భారతసేనలే గెలిచాయి.

కానీ,

ప్రసాద్‌పై కోర్టుమార్షల్ తయారయింది.

ఆర్మీ కోర్టులో-

కమాండింగ్ ఆఫీసర్ ప్రసాద్‌మీద చేసిన ఫిర్యాదు-యిచ్చిన టైంకి ప్రసాద్ వైర్లెస్‌లో తనిఖీచేసిన వివరాలను తెలియబరచలేదనీ, ఆర్మీలో, అందునా యుద్ధసమయంలో చూపించాల్సిన టైవ్‌సెన్స్ చూపించలేదనీ-

జడ్జీ "అవునా?" అని అడిగారు.

"ఎస్సర్. ఐ వజ్ లేట్ బై టూ అవర్స్. ఎనిమిదికల్లా నన్ను రిపోర్ట్ చెయ్యమన్నారు. కానీ నేను పదిగంటలగ్గానీ ఆ పని చేయలేకపోయాను" అన్నాడు ప్రసాద్ తలవంచుకుని.

"ఎందుకని?"

"అక్కడ నేను... ఓ జలాశయంలో స్నానం చేశాను."

"చెప్పిన పని చేయకుండా స్నానంచేస్తూ కూచున్నావా? పైగా రెండుగంటలా?" అన్నాడు జడ్జి.

ప్రసాద్ ఏమీ మాట్లాడలేదు.

"ఏం మాట్లాడవు?" అన్నాడు జడ్జి.

"సర్-ఐ డిజర్వ్ ది పనిష్‌మెంట్" అన్నాడు ప్రసాద్.

ఇంతలో కోర్టులో అందరికీ టీ వచ్చింది.

కమాండింగ్ ఆఫీసర్ ప్రసాద్ దగ్గరికొచ్చి, "జడ్జిగారు అడుగుతుంటే చెప్పవేం? నీలాంటి ఆఫీసర్ కేవలం స్నానం చేయటానికి రెండు గంటలు వేస్ట్ చేశాడంటే నేన్నమ్మను! నిజం చెప్పు!" అన్నాడు.

ప్రసాద్ "నిజమే సర్! నేను ఆ రెండు గంటలూ నాకు లభించిన 'జీవితం'తో గడిపాను. అదృష్టంవల్ల మనం గెలిచాం. ఏ పరిస్థితుల్లోనైనా జరిగిన యుద్ధంలో నేను చనిపోయివుంటే-కనీసం నేను అనుభవించిన ఆ రెండుగంటల జీవితం నాకు దొరికివుండేదికాదు. మనిషినై పుట్టాక ఒక తీరనికోరికతో చనిపోయి వుండేవాణ్ని!" అన్నాడు ప్రసాద్.

ఆఫీసర్ క్షణంపాటు నిశ్శబ్దంగా వుండిపోయి నెమ్మదిగా ప్రసాద్‌వైపు వొంగి-"ఎనీ వుమన్?" అని అడిగాడు.

అంతవరకూ తలవంచిన ప్రసాద్ ధైర్యంగా తలెత్తి ఆఫీసర్ కళ్లలోకి చూసి "ఎస్సర్!" అన్నాడు.

ఆఫీసర్ సన్నగా నవ్వాడు. ప్రసాద్‌పై పెట్టిన కేసును ఉపసంహరించుకున్నాడు.

* * *

ప్రసాద్ పెళ్లి ఆ ఆర్మీ యూనిట్ మందిరంలోనే జరిగింది.

"ఈ 'విషయం' తెలిశాక, మనం యుద్ధంలో ఓడిపోయివున్నా నిన్ను క్షమించేవాణ్ని ప్రసాద్!" అని అన్నాడు కమాండింగ్ ఆఫీసర్ అభినందనగా పుష్పగుచ్ఛాన్ని యిస్తూ.

"థాంక్యూ సర్!" అన్నాడు ప్రసాద్ భార్యకేసి చూసి.

పక్కనే అతని భార్యగా ఆ డోగ్రీఅమ్మాయి ప్రకృతి అంత విశాలంగా నవ్వింది.

■

